క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి



గట్టు: మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ సరిత, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, ఎంపీపీ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌బాబులు గట్టు భీముడుకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గట్టు భీముడు సతీమణి భువనేశ్వరి, కుమారులు వెంకటరమణ, సాయికుమార్, కుటుంబ సభ్యులు జడ్పీటీసీ బాసు శ్యామల, స్టేట్ కన్జూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, బలిగెర మాజీ సర్పంచు హనుమంతు నాయుడు పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు



ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపాల్‌పై గ్రామ ప్రజలు ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు, లైన్‌మెన్ శ్రీనివాసులుపై విద్యుత్ ఏడీకి వినతులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ఎలాంటి సమస్యలను పట్టించుకోవడం లేదని, సమస్యను చెబుతే దూషిస్తున్నారన్నారు. విద్యుత్ సమస్యలపై లైన్‌మెన్‌కు సమాచారం తెలపడంతో పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరుగుతున్న, అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, బోయ నరసింహ, మహేష్‌రెడ్డి, సుదర్శన్ గౌడు, శేఖర్ రెడ్డి, ఎల్లగౌడు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని అందరికీ వర్తింపచేయాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. ఈ నెల 13న సీపీఎం రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి హాజరవుతారని ఉండవెల్లి, అలంపూర్, మానవపాడు మండలాలకు సంబంధించి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గృహజ్యోతి పథకాన్ని అందరికి అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో మద్దిలేటి, రాజు, ఈదన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ధరూరు: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభవుతుందని తెలిపారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాని వారు కోరారు.

15న జయశంకర్ బడిబాట సమావేశం

కేటీదొడ్డి: ఈనెల 15న బడిబాట కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండు నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఉదయం 10:30 గంటలకు వివిధ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు తప్పకుండా హాజరు కావాలని వారు సూచించారు.

నిధులు వెంటనే నిలిపేయండి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకలలో నిర్మిస్తున్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవనానికి నిధులు నిలిపేయాలని గ్రామానికి చెందిన బీసీ నాయకులు ఎనుముల నాగరాజు ఎంపీడీఓ రమేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. 2017లో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని, నిధులు సరిపడక నిర్మాణం మధ్యలో పనులు నిలిచాయన్నారు. 2021లో అదే కమ్యూనిటీ హాల్ భవనానికి ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ పేరుతో టెండర్ పిలవడం జరిగిందని, బీసీ కమ్యూనిటీ హాల్ బదులు ముదిరాజ్ భవనం పేరట నిర్మాణం చేపడితే ఒకే కులానికి సంబంధించినది అవుతుందని, ఇతర బీసీ కులాల వారు ఘర్షణ పడే అవకాశం ఉందని తెలిపారు. భవనానికి నిధులు నిలుపుదల చేయాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలకే ప్రాధాన్యత

- బడిబాటలో ఎమ్మెల్యే విజయుడు
- ప్రారంభమైన పాఠశాలలు..
- ప్రత్యేక అలంకరణతో విద్యార్థులకు స్వాగతం
- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ



అలంపూర్‌లో బడిబాటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: బడిబాట కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. బడిబాటలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయుల బోధన చాలా చక్కగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు భాగా చదివి ఉత్తమ గ్రేడ్లను సాధించి ఉన్నత స్థాయిలో నిలివాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి హృదయరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్, ఎంఈఓ అశోక్ కుమార్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గోపాల్, సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు ఇంతియాజ్, అలీ, సుదర్శన్ గౌడు, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

గద్వాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల హెడ్మాస్టర్ ఉమాదేవి అన్నారు. బడిబాటలో కార్యక్రమంలో భాగంగా గద్వాల మండలంలోని చెనుగోనిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదు సంవత్సరాలు పూర్తయినా పిల్లలకు ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాంను అందిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికృష్ణ, రామన్‌గౌడ్, బాలరాజు, సురేందర్ రావు, తన్వీర్ ఉన్నారు.

సరస్వతి అమ్మవారికి పూజలు

ఉండవెల్లి: మండలంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలను ముస్తాబు చేశారు. పాఠశాల మొదటిరోజే తక్కశిల పాఠశాలలో విద్యార్థులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత పాల్గొన్నారు.

రూ.25 వేల నగదు అందజేత

మండలంలోని బొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మౌలిక వసతుల కోసం రంగన్న గౌడు రూ.25 వేల నగదును ప్రధానోపాధ్యాయులు కామేశ్వరికి అందజేశారు. అనంతరం బొంకూరులో మొక్కలు నాటారు.

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ మనోరమ అన్నారు. మండలంలోని గంగన్‌పల్లిలోని ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వర్, నాయకులు చక్రధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలు తెరుచుకున్న క్రమంలో తరగతుల వారీగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలతో అలంకరించి విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు మున్సిపల్ చైర్మన్ కరుణ, కమిషనర్ లక్ష్మారెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయులు అందజేశారు. తనగల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీపీ రజిత, ప్రధానోపాధ్యాయులు డిగేందర్‌రెడ్డి దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

మొదటి రోజు పాఠశాలకు 656 హాజరు

అలంపూర్ రూరల్: వేసవి సెలవులు ముగిసి బడిగంటలు మోగాయి. మొదటి రోజు విద్యార్థులు బడులకు వెళ్లారు. అలంపూర్ మండలంలోని పాఠశాలల్లో 2,556 మంది విద్యార్థులకు 656 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1900 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేదు. మొత్తం ఉపాధ్యాయులు హాజరు కాగా, 23 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు మండల విద్యాధికారి ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు.

మానవపాడు: మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాలకు పంపిణీ చేశారు. కేజీవీబీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలలకు, ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, దస్తులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, కోతులగిద్ద ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేశారు. ఐకేపీ సీసీ జయరాజ్ వీఓఏ, వీఓఏ రాధమ్మ, గ్రామ సంఘం 1, 2 అధ్యక్షురాలు సరోజమ్మ, ఖాజాబీ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు కిషోర్ పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని బల్గెర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జడ్పీటీసీ బాసు శ్యామలహనుమంతు నాయుడు, ఎంపీపీ విజయ్ విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ శాంతికుమారి, ఉపాధ్యాయులు మంజుల, శేఖర్, రూప, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ సంఘం లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



చెనుగోనిపల్లిలో..



ఉండవెల్లి పాఠశాలలో సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థులు



గంగన్‌పల్లిలో..



తనగలలో..



మానవపాడులో..



ధరూరులో..

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

- జెడ్పీ చైర్ పర్సన్ సరిత



రాజోళిలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై నినాదాలు చేస్తున్న ఎంవీ ఫౌండేషన్ సభ్యులు

శాంతినగర్: బడీడు పిల్లలను బడులకు పంపి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామంలో అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను జెడ్పీ చైర్‌పర్సన్ విడుదల చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు రవాణా సౌకర్యంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు జెడ్పీ చైర్ పర్సన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ నరసింహ, ఎంపీఓ తిరుపతన్న, జిల్లా జేఏసీ నాయకులు అడ్వకేట్ మధుసూదన్‌బాబు, ప్రధానోపాధ్యాయులు రవీంద్ర, మాజీ సర్పంచ్ తిమ్మప్ప, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోళి: బాల కార్మికులు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి అన్నారు. బాల కార్మిక నిర్మూలనపై మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: బాల్య వివాహాల నిర్మూలించడానికి కృషి చేద్దామని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరశురాముడు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గద్వాల మండలంలో మదనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకోకూడదని, పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ మోహన్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి, టీచర్ వెంకటేష్, సభ్యులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



సంకాపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ నరసింగరావు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వినియోగించుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి డీపీఎం విలాస్‌రావుతో కలిసి ఆయన హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వచ్చిన ఏకరూప దుస్తులను, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. షేకుపల్లిలో ఎంపీపీ స్నేహ బడిబాట ప్రారంభించి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ హనుమంతురెడ్డి, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఎంఈఓ రాజు, నాయకులు శ్రీదర్‌రెడ్డి, సీసీ బీచుపల్లి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అయిజ: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ నరసింగరావు అన్నారు. మండలంలోని సంకాపురంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెడ్ మాస్టర్ కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరస్వతి ఆధ్వర్యంలో పీటీఎం సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఏ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సరస్వతి పాఠశాల అభివృద్ధి కోసం రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఏఈ లక్ష్మన్న, సింగిల్ విండో డైరెక్టర్ రాముడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న జక్కుల వెంకటయ్య

గద్వాల అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న నేటికీ రైతు భరోసా, రైతు రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. ఈనెల 15లోపు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలను చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతాంగ సమితి ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు ఖాజామైనుద్దీన్, జిల్లా సత్యారెడ్డి ఉన్నారు.

ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

గద్వాల వ్యవసాయం: విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఏఓ జనార్దన్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డిలు విత్తన దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం పట్టణం, మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయా దుకాణాల్లో విత్తన పాకెట్లను, స్టాక్ రికార్డ్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. విత్తనాల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్‌బోర్డుపై రాసి ఉంచాలన్నారు. ఇన్‌చార్జి ఏఓ శ్రీలత తనిఖీ బృందం వెంట ఉన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం వడ్డేపల్లి మండలం జిల్లేడుదిన్నే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త హరిజన మారెన్న రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పార్టీ సభ్యత్వం ఉండగా, వారికి ప్రమాద బీమా పథకం నుంచి రూ.2 లక్షల చెక్కును అతని భార్య జయమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన స్వప్న ఆపరేషన్ కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నాగేష్, రవికుమార్, మద్దిలేటి, దివాకర్, యుగంధర్, మహానంది పాల్గొన్నారు.

బాలుడి మృతికి నివాళి

మానవపాడు: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 2వ తరగతి విద్యార్థి వినేష్(8) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం ఉదయం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆనందం, ఉపాధ్యాయులు బాలుడి మృతికి నివాళుర్పించారు. అనంతరం 2నిమిషాలు మౌనం పాటించారు. బాలుడి మృతిపై ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటి పర్యాంతమయ్యారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

గద్వాల: జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య లోపం వల్ల అధ్వానంగా తయారైందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్ జయశ్రీ కోరారు. బుధవారం మున్సిపల్ అధికారులకు ఆమె వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కొంత కాలంగా ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదన్నారు. రోడ్ల పక్కన చెత్తను పారేస్తున్నారని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పరిసరాలు మరింత అధ్వానంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్, చైర్మన్ తక్షణమే జోక్యం చేసుకుని పారిశుద్ధ్య నిర్వాహణను మెరుగుపర్చాలని కోరారు.

ఉద్యోగ భధత్ర కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అయిజ: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆమట్లాడారు. చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ జీవితాలు మారడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హర్షవర్ధన్‌రెడ్డి, నాగరాజు, మహేంద్రనాథ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.7500 రైతు భరోసా ఏది?



మాట్లాడుతున్న జీ కే ఈదన్న

అలంపూర రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రైతు భరోసా హామీ ఎకరానికి రూ.7500 నగదు అందిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. రైతులు విత్తనాలు నాటేందుకు భూమిని చదును చేసి సిద్ధంగా ఉన్నారని రైతు భరోసా వెంటనే ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీ కే ఈదన్న డిమాండ్ చేశారు. అలంపూర్ మండలంలోని లింగన్‌వాయిలో రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, వరి, కంది, మినుములు, తదితర పంటలు పండించేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్నా ప్రభుత్వ మాత్రం రైతు భరోసా అందించలేదన్నారు. జూన్ మాసం రెండవ వారం పూర్తి అవుతున్న వ్యవసాయశాఖ ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో విత్తనాలు అందించలేక పోయిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ పథకం అమలు చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులపై అప్పు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమావేశంలో ఎం రాఘురాములు, తిరుపాలు, భాస్కర్, కోటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

గొడుగులకు భలే గిరాకీ

కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో చాలా మంది రంగురంగుల గొడుగులను కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు, వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్లే రైతులు వర్షాలకు తడవకుండా జాగ్రత్తల్లో భాగంగా గొడుగులను కొనుగోలు చేస్తున్న దృశ్యాలు బుధవారం 'సాక్షి'కి కెమెరాలో బంధించింది.

– గద్వాల అర్బన్



గద్వాల పాతబస్టాండ్‌లో గొడుగులను కొంటున్న ప్రజలు

అభివృద్ధికి కృషిచేయాలి

అయిజ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. సర్పంచుల పదువులు ముగిశాక గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు పూర్తి స్థాయిలో చేపట్టడంలేదని, దాని వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారులు పనిచేస్తున్నారని, పాలన అధికారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

గద్వాల క్రైం: నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది మాధుసూదన్‌రెడ్డి, నరేందర్‌లు అన్నారు. బుధవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. పాఠశాల, అంగన్‌వాడీలు, కళాశాలలో చదువుతున్న ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు. సాధారణంగా పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ అనేది చేతులు శుభ్రంగా ఉంచుకోకపోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన వంటివి చేయడం వల్ల నులిపురుగుల సంక్రమణ ఉంటుందన్నారు. అందుల్లో భాగంగా నులిపురుగుల నివారణకు అందరు కృషి చేయాలన్నారు.